# సూర్య

నేటి దినపత్రిక

17 వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం | 15 జులై 2024 | పేజీలు 8


# మంత్రి నిమ్మలకు ఘన స్వాగతం

**నెల్లూరు జిల్లా తొలిసారిగా వచ్చిన ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల**



**నెల్లూరు క్రైం, మేజర్ న్యూస్ :** జిల్లాలోని జలాశయాలను పరిశీలించేందుకు తొలిసారిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిర్మల రామానాయుడు నెల్లూరుకు విచ్చేశారు. నెల్లూరు ఆర్ అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మంత్రిని నెల్లూరు జిల్లా మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి సాలవాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు విషయాలతో పాటు జిల్లాలో ఉన్న జలవనరులపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. వారి వెంట ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దగ్గుమాటి కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ,జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తో పాటు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఉన్నారు.

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఆక్రమణకు అడ్డుఆపూ లేకుండా ఉంది. రోడ్డు, తిప్ప, వాగు పోరంబోకు స్థలాలు యధేచ్ఛగా ఆక్రమించుకొని పెద్దపెద్ద నిర్మాణాలు చేయడం తెల్సిందే. కాగా మున్సిపల్ పరిధిలోని శాంతినగర్‌వద్ద మూడేళ్ళుగా యధేచ్ఛగా ఆక్రమణల పర్వం సాగుతుండగా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు అధికారులే ఆక్రమణదారులకు అండగా ఉన్నారన్న ప్రచారం సాగుతుండేది. కాగా 2022లో ఈ ఆక్రమణల పర్వం గురించి 'మేజర్‌న్యూస్' ప్రచురించగా అప్పటి ఆర్డీవో చైత్రవర్షిణి స్పందించి 20 మంది సిబ్బందిని నియమించి సర్వే చేయించి నివేదికలు తెప్పించారు.

- మున్సిపల్, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బందే ఆక్రమణదారులు
- తాజాగా నరసాపురంవాసులు
- అటకెక్కిన గత విచారణ
- రూ.కోట్ల విలువ గల భూమికబ్జా



## శాంతినగర్‌లో.. ఆక్రమణల జోరు !

**చోద్యం చూస్తున్న అధికారులు**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

అక్కడ గతంలో 116 ప్లాట్లతో పభుత్వం లేఅవుట్ వేసి దాదాపు 70 మందికి పట్టాలిచ్చారని చెబుతుండేవారు. లేఅవుట్‌కు ఆవతల కూడా స్థలాలుండేవి. కాగా 12 మంది మున్సిపల్ సిబ్బంది శాంతినగర్ లేఅవుట్‌కు ఆవతల స్థలాలు ఆక్రమించుకొని చిన్నపాటి రేకుల ఇళ్ళు నిర్మించారు. వారిలో ఒక్కరు మాత్రమే అర్హులని, మిగతా వారు పట్టాలిచ్చేందుకు కూడా అర్హులు కాదంటూ ఆర్డీవో నిర్ధారించగా తహసిల్దారు వారికి నోటీసులు కూడా ఇచ్చారు. అయినా వారు ఖాతరు చేయకపోగా వాటిని తొలగించే చర్యలు చేపట్టలేదు. అనంతరం క్రమీణా అక్కడ మాజీ ఎమ్మెల్యే సిబ్బంది, మున్సిపల్, రెవిన్యూ, హౌసింగ్ సిబ్బంది స్థలాలను ఆక్రమించుకున్నారు. కొందరైతే రెండేసి, మూడేసి స్థలాలు కూడా ఆక్రమించుకున్నారని, కొందరు

-మిగతా 2లో



తాజాగా స్థలాలు ఆక్రమించుకొని నిర్మాణాలు ప్రారంభించిన దృశ్యం



## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం ప్రతి సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి నెల్లూరు కలెక్టరేట్‌లోనీ తిక్కన ప్రాంగణంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేసి తమ సమస్యలను పరిష్కారం చేసు కోవాలని పిలుపునిచ్చారు.

**ఆత్మకూరు చెరువు, తూములను పరిశీలించిన**

## రైతు సంఘ నాయకులు




## జనసేన పతాక ఆవిష్కరణ



లోపల పేజీలో

ఏఎస్ పేటలో..

## సైడ్ కాలవలు త్వరితగతిన పూర్తి చేయండి



## జగన్ వ్యవస్థలను నాశనం చేశాడు



- చారిత్రాత్మక ప్రాజెక్టులను చెదలు పట్టించాడు
- రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్ళింది
- చేసిన తప్పులకు ఓటర్లు బుద్ధి చెప్పారు
- ఇద్దరు కృష్ణులు ఇరిగేషన్‌కు పట్టిన పీడ
- హై లెవెల్ కెనాల్ ఊసే మరిచారు
- ఆఫ్రాన్ పనుల పునః ప్రారంభానికి ఆదేశాలు
- ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు

**అనంత సాగరం, మేజర్‌న్యూస్ :**

గత జగన్ ప్రభుత్వం వ్యవస్థలన్నిటిని వినాశనం చేశాడని, ముఖ్యంగా చారిత్రాత్మక ప్రాజెక్టులను, జలాశయాలను నిర్లక్ష్యం చేసి చెదలు పట్టించాడని, 20 ఏళ్లు రాష్ట్రం వెనక్కి వెళ్లేలా చేశాడని, కనుకనే రాష్ట్ర ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అనంత సాగరం మండలం సోమశిలలోని జలాశయాన్ని

-మిగతా 2లో



**నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే**

## చర్యలు తప్పవు

**మత్స్యశాఖ ఏడి శ్రీనివాసులు - సూర్య కథనానికి స్పందన**

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల జలాశయంలో చేపల వేటపై విధించిన నిషేధాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని మత్స్య శాఖ ఏడి శ్రీనివాసులు తెలిపారు. అక్రమ చేపల వేట పై ఇదేందబ్బా దోపిడీ అన్న **'సూర్య'** కథనానికి అధికారి స్పందించారు. ఆదివారం ఏడి సోమసులకు విచ్చేశారు ప్రాజెక్టులో తట్టున పర్యటించారు. స్థానికంగా ఓ జాలరి చేపలను పట్టి తీసుకువెళుతూ అధికారికి పట్టుబడ్డాడు. ఐదు కేజీలు చేపలను అతని నుండి స్వాధీనం చేసుకున్నామని ఏడి తెలిపారు. మరోసారి నిబంధనలకు విరుద్ధంగా వేట సాగించరాదని హెచ్చరికలు చేశామని ఆయన తెలిపారు. చరవాణి ద్వారా అధికారి మాట్లాడుతూ సూర్య కథనంలో అక్రమంగా అర్ధరాత్రుల్లో చేపలు తరలిపోతున్నాయని ప్రచురించడంపై స్పందించారు. సిబ్బంది కొరత తమ శాఖను వేధిస్తోందని స్థానికంగా ఉన్న అధికారిని మహిళ కావడంతో దృష్టి సారించలేకున్నామని తెలిపారు.

# శాంతినగర్‌లో ఆక్రమణల జోరు



సిబ్బంది ఆక్రమించుకున్న స్థలాలు

*(మొదటి పేజీ తరువాయి)*

విక్రయించారని పలువురు చెబుతుంటారు. తాజాగా ఓ వైసిపి కౌన్సిలర్ జోక్యంతో ఆసమీపంలోని నరసా పురంకు చెందిన దాదాపు 13 మంది స్థలాలు ఆక్రమించుకొని జెసిబిలతో చదును చేయించి నిర్మాణాలు ప్రారంభించారు. ఈ విషయమై అధికారుల దృష్టికి వెళ్ళినా పట్టించుకోలేదని పలువురు చర్చించు కుంటున్నారు. కోట్లాది రూపాయల విలువగల ప్రభుత్వ స్థలాలను యధేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా, అదీగాక మున్సిపల్, రెవిన్యూ, హౌసింగ్ సిబ్బంది ఆక్రమించుకున్నా, నిర్మాణాలు సాగిస్తున్నా, బినామీ పేర్లు అని ప్రచారం జరుగుతున్నా అధికారులు మాత్రం ఏమాత్రం స్పందించకుండా చోద్యం చూస్తున్నారు. ఇంతగా విచ్చలవిడి ఆక్రమణలపట్ల అధికార యంత్రాంగం స్పందించకపోవడం పలు సందేహాలకు తావిచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇంతటి దోపిడీ వ్యవహారం ఆత్మకూరులో సాగుతుందని, మరెక్కడా ఇలాంటి విచ్చలవిడి పరిస్థితి ఉండబోదని, ప్రభుత్వంలోని వారే విపరీతంగా ఆక్రమించుకోవడం, అత్యంత విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరి ఖచ్చితంగా వ్యవహరించే ఆత్మకూరు ఆర్డీవో స్పందించి సమగ్రంగా విచారణ,సర్వే చేయిస్తే వాస్తవాలన్నీ వెల్లడికాగలవని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. మరి చర్యలకు పూనుకుంటారేమో చూడాల్సి ఉంది.



ఆక్రమిత స్థలంలో నిర్మాణం ప్రారంభించిన ఓ ఉద్యోగి



మాజీ ఎమ్మెల్యే సిబ్బంది నిర్మించిన గృహం



మున్సిపల్ సిబ్బంది నిర్మించిన ఇళ్ళు



ఆక్రమిత స్థలానికి హద్దులు వేసుకున్న దృశ్యం

# జగన్ వ్యవస్థలను నాశనం చేశాడు



*(మొదటి పేజీ తరువాయి)*

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిలతో కలిసి సందర్శించారు. షెడ్యూలు కంటే ఆలస్యంగా సోమశిలకు విచ్చేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు సరాసరి అతిథిగృహానికి వెళ్లి స్థానిక పరిస్థితులపై చర్చించారు. మంత్రి ఆనం ప్రస్తుత జలాశయ దీన పరిస్థితిలు, నిలిచి ఉన్న ఆనం సంజీవరెడ్డి హై లెవెల్ కెనాల్ తీరు తదితర విషయాలను మంత్రి నిమ్మలకు వివరంగా విషదపరిచారు. అనంతరం హై లెవెల్ కెనాల్ నిర్మాణ ప్రారంభ పైలాన్ ప్రాంతం వద్దకు వెళ్లారు. హై లెవెల్ నిర్మాణ ఆవశ్యకత, పూర్తయితే మెట్ట ప్రాంతాలకు చేకూరే ప్రయోజనాలు, ప్రస్తుత పనుల పరిస్థితి తదితర విషయాలను మంత్రి ఆనం ఇరిగేషన్ శాఖ మంత్రికి వివరించారు. ప్రస్తుతం తీవ్ర కాలయాపన జరిగి ఉన్న నేపథ్యంలో పనులు పునః ప్రారంభిస్తే పెరిగిన మెటీరియల్ ధరల ఆధారంగా ఎంత నిధులు కేటాయించాల్సిన ఆవశ్యం ఉంటుందో తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆ శాఖ అధికారులకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. అనంతరం సోమశిల ప్రాజెక్ట్ వద్ద దెబ్బతిని ఉన్న ఆఫ్రాన్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. టెండర్ ప్రక్రియ, పనులు జరిగిన తీరు, వాటిని నిలిపివేసే సమయానికి కాంట్రాక్టర్‌కు చెల్లించిన బిల్లులు, తదితర విషయాలను ప్రాజెక్టు ఎస్.ఈ రమణారెడ్డి డిజైన్ మ్యాప్ ద్వారా వివరించారు. అవి అసంపూర్తిగా నిలిచిపోవడానికి గల కారణాలను, పనులు చేపట్టిన తీరుపై మంత్రి రామానాయుడు సదరు గుత్తేదారునే ప్రశ్నించడం జరిగింది. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారమే నిర్ణీత డిజైన్ కు లోబడి పనులను చేపట్టామని బిల్లులు రాక అర్ధాంతరంగా ఆపివేసామని గుత్తేదారు మంత్రికి తెలిపారు. గత ప్రభుత్వం ఇంకా చెల్లించాల్సిన బకాయి బిల్లులు ఉన్నాయా అన్న ప్రశ్నకు ఐదు కోట్ల వరకు ఉన్నాయని శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ యజమాని తెలపడం జరిగింది. వాటితో తమకు పని లేదని ఇకనుంచి చేసిన పనుల తాలూకు ప్రతి దశలోను బకాయిలు ఉండకుండా చెల్లింపులు ఉంటాయని మంత్రి భరోసా ఇచ్చారు. పనులను వీలైనంత త్వరగా తిరిగి ప్రారంభించాలని రాబోవు వర్షాకాలంలోగా ఎక్కువ శాతం పురోగతి ఉండేలా జరగాలని సూచించారు. అనంతరం సోమేశ్వర ఆలయానికి వెళ్లిన మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, ధర్మకర్త ఉప్పల విజయ్ కుమార్ వారికి మేళతాళాలతో, మంత్రోచ్ఛారణ నడుమ ఘన ఆహ్వానం పలికారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద వివిధ రకాల అర్జీలను మంత్రులు స్వీకరించారు. తదుపరి సోమశిల ప్రాజెక్టు పైకి వెళ్లడం జరిగింది. జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ, ప్రాజెక్టుకు లోతట్టున్న ఇతర రిజర్వాయర్లు, నీటి లభ్యత వనరులు తదితర విషయాలపై ఇరిగేషన్ మంత్రి ఆరా తీశారు. ఆఖరుగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

### రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్ళింది :

గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలు, రంగాలు అభివృద్ధికి నోచుకోక అధోగతి పాలు అయ్యి రాష్ట్రం 20 ఏళ్ల వెనుకబాటు తనానికి గురైందని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రాజెక్టులు రిజర్వాయర్లు, జలాశయాలు, పంట కాలువలు కనీస నిర్వహణకు నోచుకోక చెదలు పట్టినట్టుగా ఉంటుండటం దురదృష్టకరం అన్నారు. వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి నిరోధక పాలన చర్యలతో దిగజారిన ఆర్థిక పరిస్థితులు ఏర్పడ్డాయని వీటి అన్నింటిని గాడిలో పెట్టాలంటే తమకు రెండింతల పని ఉందని అన్నారు. అయినప్పటికీ రైతాంగ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసే ముందుకు సాగుతుంది అన్నారు. విచిత్ర పాలనలో భాగంగా గత వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరిట అన్ని అభివృద్ధి పనులను కమిషన్‌లకు కక్కుర్తి పడి తమ అనునాయులకే కట్టబెట్టిందన్నారు. తెలుగు గంగ నుంచి ఆల్తూరు రిజర్వాయర్ కు నీటిని పంపిణీ చేసే పనులను గమనిస్తే జగన్ పాలనలో ఒక్క శాతం పనులు కూడా జరగకపోవడం దారుణం అన్నారు. 2018లో అప్పటి తమ ప్రభుత్వం పనులను ప్రారంభించి 2019 ఎన్నికల సమయం నాటికి 40 శాతం పనులను పూర్తి చేసామని ఇరిగేషన్ పట్ల తమ ప్రభుత్వ చిత్తశుద్ధి ఎప్పటికీ ఇలాగే ఉంటుంది అనటానికి ఇదో మచ్చుతునక అన్నారు. దేశ అభివృద్ధికి వెన్నెముక లాంటి వ్యవసాయం, రైతాంగం పట్ల తమ పార్టీ ఎప్పుడు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూనే ఉందని తెలిపారు. 2014, 19 కాలంలో తమ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్‌కు పెద్ద పీట వేసామన్నారు. అప్పటి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర బడ్జెట్ 7 లక్షల కోట్లు కాగా 80 వేల కోట్ల రూపాయలు ఒక్క ఇరిగేషన్‌కు కేటాయించామని ఆయన గుర్తు చేశారు. అయితే జగన్ ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల పాలనలో మొత్తం రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు 12 లక్షల కోట్లు కాగా ఇరిగేషన్ కు వారు కేటాయించినది కేవలం 30 వేల కోట్లు అని ఎద్దేవా చేశారు. అలాగే ఆనం సంజీవరెడ్డి హై లెవెల్ కెనాల్ నిర్మాణంలో తమ ప్రభుత్వ హయాంలో పేజ్ వన్ పనుల్లో భాగంగా 60 శాతం పనులను చేసి ఉన్నామని గుర్తు చేశారు. అయితే వైసిపి ప్రభుత్వం మెట్ట ప్రాంతాలకు తాగు, సాగుకు సోమశిల జలాలను అందించే ఈ కెనాల్ మహోన్నత లక్ష్యాన్ని నీరుగార్చిందన్నారు. వారి హయాంలో అట్టహాసంగా ప్రారంభించిన ఫేజ్ 2 దశ పనుల్లో ఒక్క శాతం పనులు కూడా పూర్తి అయిన దాఖలాలే లేవన్నారు. 2020, 21 వరదలకు దెబ్బతిన్న సోమశిల ప్రాజెక్టు స్థితిగతులను పూర్తిగా మార్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆ దిశగా తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రస్తుత సోమశిల ప్రాజెక్టు కడు దయనీయంగా ఉంటున్న విషయాలు తన దృష్టికి రావడం తనను ఎంతో బాధించింది అన్నారు. గేట్ల ఆపరేటింగ్ నిర్వహణకు ఎంతో కీలకమైన రోప్ వ్యవస్థ పూర్తిగా అవగాహన స్థితికి చేరిందంటూ కొన్ని దృశ్యాలను మీడియాకు చూపించారు. నిర్వహణ మాట అటుంచితే గత ప్రభుత్వం గేట్లకు కనీసం గ్రీసు పూసిన సందర్భమే లేకపోవడం దారుణం అన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు గత ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రులుగా విడతల వారి పాలన చేశారని గుర్తు చేశారు. ఆ ఇద్దరు కృష్ణులు సోమశిల ప్రాజెక్టు కు ఏ కొంచెం మేలు చేశారు చెప్పగలరా అని సవాల్ విసిరారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి పనులను విస్మరించి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు కనుకే.. ప్రజలు ఓటర్లు ఆ పార్టీని చిత్కరించుకున్నారని జగన్ పాలనకు చరమగీతం పాడారని విమర్శించారు.

తమ ప్రభుత్వం మాత్రం ప్రజల పక్షాన ఉంటూ, అభివృద్ధికి ప్రముఖ స్థానాన్ని కల్పించి రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకు వెళ్ళేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా బిజెపి నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, ప్రాజెక్టు అధికారులు, మండల టిడిపి అధ్యక్షురాలు మునగపాటి సునీత నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ప్లాస్టిక్ వస్తువుల నిషేధం హుష్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ వస్తువుల నిషేధం ప్రకటనలకే పరిమితమైంది. సాక్షాత్తు స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో ఏడాదిన్నర క్రితం జరిగిన మున్సిపల్ సమావేశంలో అక్టోబరు 2 గాంధీజయంతినాటికి ప్లాస్టిక్‌వస్తువులను నిషేందించేలా అందరం కృషిచేద్దామని నిర్ణయించారు. అనంతరం మున్సిపల్ పరిధిలో 16 రకాల ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించామని అప్పటికమీషనర్ ఎం.రమేష్‌బాబు పేర్కొన్నారు. జూల్కై 1వతేదీ నుండే ఈ నిషేధపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు. కేంద్రప్రభుత్వ ఆదేశాలమేరకు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులోకి తెచ్చామన్నారు. మనిషి జీవితంలో భాగంగా మారిన ప్లాస్టిక్ వినియోగం వలన అనేక అనర్ధాలున్నాయని, ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం 16రకాల ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించిందని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ ఇయర్‌బర్డ్స్ నుండి బెలూన్ల వరకు నిషేధం జాబితాలో ఉన్నాయన్నారు. ఈ నిషేధపు ఉత్తర్వులు ఉల్లంఘించిన వారెవరైనా తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇయర్ బర్డ్స్, బెలూన్లు, క్యాండి, ఐస్‌క్రీమ్ కోసం వాడు ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, చెంచాలు, కత్తులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్‌బాక్సులు, ఆహ్వానపత్రాలు, సిగరెట్‌ప్యాకెట్లు, 100 మైక్రాన్‌లోపు ఉండే పివిసి బ్యానర్లు, అలంకరణకోసం వాడే థర్మాకోల్ తదితర 16రకాల ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పై నిషేధం అమలులో ఉందన్నారు. ప్రజలు తప్పకుండా ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని ఆయన కోరారు. ఒకదపా వాడి పారేసిన వస్తువులను తయారుచేసే పరిశ్రమలకు ఎలాంటి ప్లాస్టిక్ ముడి సరుకులు సరఫరాచేయరాదని కెమికల్ సంస్థలకు కేంద్రప్రభుత్వం ఆదేశాలిచ్చిందని రమేష్‌బాబు పేర్కొన్నారు. వాణిజ్య సంస్థలు తమ పరిధిలో ఒకసారి వాడిపారేసిన ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని ఆయన సూచించారు. పట్టణంలోని అన్నివర్గాల వారు ప్లాసిక్ నిషేధానికి సహకరించాలని, ఆత్మకూరును ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు అందరూ తమవంతుగా కృషిచేయాలని రమేష్‌బాబు కోరారు. కానీ ఎవరూ సహకరించలేదు, అధికారులు పట్టించుకోలేదు, దాంతో నిషేధం ప్రకటనలకే పరిమితమైంది. మరి ఈవిషయమై ఏదేని చర్యలకు శ్రీకారం చుడతారేమో చూడాల్సి ఉందని భావిస్తుండగా తాజాగా మున్సిపల్ కమీషనర్ షేక్ ఫజులుల్లా ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్లాస్టిక్ వినియోగం నిషేధమని, వినియోగించేవారిపై. విక్రయించేవారిపై చర్యలు తీసుకుంటామని, ఫెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు. మరి ఎలాంటి పరిణామాలుంటాయో చూడాల్సి ఉంది.

# ఏఎస్ పేటలో.. సైడ్ కాలవలు త్వరితగతిన పూర్తి చేయండి

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలో జరుగుతున్న సైడ్ కాలువల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏఎస్ పేట మండల బిజెపి నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రమైన ఏఎస్ పేటలో బీజేపీ మండలసమావేశము నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ ఆత్మకూరు కన్వీనర్ కంది మల్లికార్జున రెడ్డి మండల బిజెపి అధ్యక్షులు చెంచులు రెడ్డి, ఉపాధ్యక్షులు, ప్రధా కార్యదర్శులు మైనారిటీ, ఓబీసీ, ఎస్సీ కార్యదర్శులు, గ్రామాలకార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో బిజెపి నాయకులు పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని తద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు సన్నాహాలు చేసుకునేందుకు కార్యాచరణ రూపంలో కార్యకర్తలు ముందుండాలని సూచించారు అనంతరం ఏఎస్ పేట దర్గా ప్రధాన రహదారి సైడ్ మురికికాలువలు సందర్శించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అలాగే ప్రధానమంత్రి ఆలోచన కార్యక్రమంలో భాగంగా అమ్మకోసం ఒక



మొక్క కార్యక్రమం ఏఎస్ పేట పోలీసు అధికారులతో కలసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశేషాదరణపొందుతున్న సరస్వతీదేవి ఆలయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణ శివాలర్లలో బగ్గేరు గట్టున తిరునాళ్లతిప్పలోని శ్రీశ్రీశ్రీ కాశీనాయన ఆశ్రమ ప్రాంగణంలోని చదువులతల్లి సరస్వతీదేవి ఆలయం విశేషాదరణ పొందుతోంది. ఈ ఆశ్రమ ప్రాంగణంలో శ్రీ కనకదుర్గాదేవి, నర్మదాబాణ శివలింగం, శ్రీ వీరభోగ వసంతరాయలు, శ్రీగాయత్రీమాత, శ్రీ అయ్యప్పస్వామి, శ్రీపాదవల్లభుడు, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ సిద్ధయ్య ఆలయాలతోపాటు సంతానపుట్ట, నాగార్పమ్మ విగ్రహం, నవగ్రహాల, అష్టదిక్పాలకుల, పలువురు దేవతామూర్తుల విగ్రహాలు, తపోభూమి తదితరాలన్నీ ఉండగా ఇదే ప్రాంగణంలో చదువుల తల్లి సరస్వతీదేవి ఆలయాన్ని కూడా నిర్మించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖమ్మం జిల్లా బాసరలో మాత్రమే సరస్వతీదేవి ఆలయం ఉండగా ఆత్మకూరులో కూడా నిర్మించగా రెండవదిగా ఉండసాగింది. అయితే రాష్ట్రం విడిపోవడంతో బాసర తెలంగాణాలోకి పోగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆత్మకూరు సరస్వతీదేవి ఆలయం రాష్ట్రంలోనే ఏకైకంగా కొనసాగుతుంది. ఈ ఆలయం కేవలం 14గంటలల్లోనే నిర్మించి అనంతరం మరింతగా వృద్ధి చేశారు. ఆలయంలో అమ్మవారికి నవరాత్రి సందర్భంగా రోజుకొక అలంకారంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర భక్తులు ఆలయంలోని అమ్మవారిని సందర్శించుకుంటుంటారు. ఇక్కడే పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం గావిస్తుంటారు. ఋగ్వేదంలో సరస్వతీదేవి గంగాదేవిగా ఖ్యాతి గాంచిందని, వేదకాలానంతరం సరస్వతీదేవిగా





రూపాంతరం చెంది సంగీత, సాహిత్య దేవతగా ప్రసిద్ధి గాంచిందని చెబుతుంటారు. హిందూ సాంప్రదాయంలో ఆ తల్లి సృజనాత్మకవిద్య, విజ్ఞానం, చైతన్యం, సంగీత, సాహిత్య కళలకు, శక్తికి దర్పంగా విరాజిల్లుతోంది. సరస్వతీదేవిని జ్ఞానం కోసమేకాకుండా మోక్షం ప్రసాదించే అధ్యాత్మికజ్ఞానసము పార్జనకు నెలవుగా పరిగణిస్తుంటారు. వేదాలకు తల్లిగా కూడా పరిగణిస్తుంటారు. అలాంటి చదువులతల్లి సరస్వతీదేవి ఆలయం ఆత్మకూరులోని కాశీనాయన ఆశ్రమంలో భక్తులు నిర్మించగా దినదినాభివృద్ధి చెందుతూ విశేషాదరణతో విరాజిల్లుతోంది.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి : అదనపు కమిషనర్ శర్మద



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిఆర్ జిఎస్) కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అదనపు కమీషనర్ శర్మద ఆకాంక్షించారు. తేది.15-07-2024 సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ మీటింగ్ హాల్‌లో 10.00 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాలయంలో అదనపు కమీషనర్‌ను నేరుగా కలిసి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందుకున్న సమస్యలను వీలున్నంత త్వరగా పరిష్కారం అందించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసుకొని కృషి చేస్తామని అదనపు కమీషనర్ తెలిపారు.

## సిబ్బంది కొరతపై మంత్రి నిమ్మలకు వినతి

వర్క్ చార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామయ్య



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల ప్రాజెక్టు నిర్వహణకు సిబ్బంది లేక అవస్థలు పడుతున్నామని, పని ఒత్తిడి భారం పెరుగుతోందని వర్క్ చార్జ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి రామయ్య ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం సోమశిల ప్రాజెక్టును ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సందర్శించారు. సోమశిల ప్రాజెక్టుపైకి వచ్చిన ఇరిగేషన్ మంత్రి నిమ్మలకు ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి రామయ్య వినతిని లేక ద్వారా విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రాజెక్టు అధికారులు కూడా ఇదే విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి హామీపై ప్రాజెక్టు వర్క్ చార్జ్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

## కాలనీవాసులకు చెట్టే షెల్టర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నువ్వురుపాడు మజరా అంబేద్కర్ నగర్ వద్ద ఒక బస్‌షెల్టరు నిర్మించాలన్న వారి అభ్యర్ధన కంఠ శోషగానే ఉందని వాపోతున్నారు. కాలనీ బస్టాండు వద్ద ఒక రచ్చబండ ఉండగా మద్యలో ఉన్న ఒక చెట్టే బస్‌షెల్టరుగా వినియోగించు కుంటు న్నారు. ఎండల్లో సరే కానీ వర్షాకాలం ఈచెట్టు క్రింద తడిసిముద్ద వుతు న్నామని కాలనీవాసులు చెబుతున్నారు. ఎన్నో ఏళ్ళనుండి తమ బస్టాండు వద్ద ఒక బస్‌షెల్టరు నిర్మించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకపోయిందని వారు చెబుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులైనా తమ అసౌకర్యం, అవస్థ గుర్తించి ఒక బస్‌షెల్టరు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## అవకాశవాదులను పార్టీలోకి చేర్చకండి

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** వైసిపి పార్టీ కోవర్టలను, అవకాశావాదులను నేడు టిడిపి పార్టీలోకి ఆహ్వానించడం కార్యకర్తల మనోభావాలను దెబ్బతీయటమే అని క్లస్టర్ ఇన్‌చార్జ్ కొప్పాల నరసింహులు అన్నారు.గత ఎన్నికల్లో టిడిపి ఏజెంట్ పై గొడవకు పాల్పడిన వ్యక్తిని నేడు పార్టీలోకి చేర్చుకోవడం సబబు కాదన్నారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో టిడిపి నాయకుల ఫ్లెక్సీలో అతని ఫోటో వేయడం స్థానిక కార్యకర్తల్లో అసంతృప్తిని రగిలిస్తోందని మండిపడ్డారు. మండల వ్యాప్తంగా చాలామంది వైసిపి పార్టీ సీనియర్ నాయకులు టిడిపిలోకి చేరెందుకు లాబీయింగ్ చేస్తూ ఉండటం దురదృష్టకరం అన్నారు. మొదటినుంచి టిడిపి జెండా మోస్తూ పార్టీ అభివృద్ధికి, గెలుపుకు పాటుపడిన నిజాయితీ కార్యకర్తలను కించపరచరాదని అటువంటి వారిపై పెద్దలు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఉపఎన్నికల్లో ఇండియా కూటమి హవా..

▶ నెల్లూరు జిల్లా డీసీసీ అధ్యక్షులు చేవూరు దేవ కుమార్ రెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** దేశవ్యాప్తంగా జరిగిన 13 అసెంబ్లీ స్థానాల్లో 10 స్థానాల్లో ఇండియా కూటమి ఘనవిజయం సాధించింది. రెండు స్థానాల్లో మాత్రమే బీజేపీ గెలిచిందని. బీజేపీ పతనం ప్రారంభమయ్యిందని ఉప ఎన్నికల ఫలితాలు నిరూపిస్తున్నాయని నెల్లూరు జిల్లా డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి కాంగ్రెస్ కూటమి విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఇందిరా భవన్లో జరిగిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అనేక విజయాలను సాధిస్తుందని, లోక్‌సభలో ప్రశ్నిస్తే పిల్ల చేష్టలుగా అభివర్ణించడం దేశంలో ఉన్న 60శాతం యువత పైన మోదీ అభిప్రాయం వెల్లడైందని, మోదీ పదేళ్ల పాలనలో బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు నడిపారని సంపదనంతా ధనికులకే కట్టబెట్టారని చేవూరు విమర్శించారు. బిజెపి మ్యానిఫెస్టోలో ప్రత్యేకహోదా ఇస్తానని చెప్పినా, పదేళ్ల మౌనంగా ఉండిపోయారని ఇప్పుడైనా ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్న



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విభజన హామీలు పోలవరం వచ్చేందుకు చంద్రబాబు నాయుడు ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.వెంకట్రావు,శ్రీనివాసులు రెడ్డి, సిటీ ఇంచార్జ్ ఫయాజ్, తిరుపయ్య, కె.సంజయ్ కుమార్, మోహన్ రెడ్డి, హుస్సేన్ భాష, మోహన్, గణేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు, తూములను పరిశీలించిన రైతు సంఘం నాయకులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు చెరువును, తూములను ఆదివారం ఏపీ రైతు సంఘ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అలనా పాలనా లేక రాయల కాలం నాటి ఆత్మకూరు చెరువు తల్లిదండ్రులు లేని అనాథ బాలుడు లాగా రోదిస్తూ ఉన్నదన్నారు. 1098 ఎకరాల విస్తీర్ణంలో సహజ సిద్ధమైన బొగ్గేరు నీటితో నిండే విధంగా నిర్మాణం, చెరువు మిగులు జలాలు వృధా కాకుండా వెంకట్రావు పల్లె సర్వాపురం వాసిలి గ్రామాల పొలాలకు సాగునీరు అందించే విధంగా ఏర్పడినదే ఆత్మకూరు చెరువన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘ నాయకులు ఆత్మకూరు చెరువును సందర్శించి పొలాలకు నీరు అందించే తూములను పరిశీలించి చెరువు లోపల భాగం గమనించడం జరిగిందన్నారు. 500 సంవత్సరాల క్రితమే అద్భుతమైన టెక్నాలజీతో సుమారు 2600 ఎకరాలకు సాగునీరు అందిస్తూ ఉన్నదన్నారు కాలక్రమంలో చెరువు ఆయకట్టు పరిధి 5500 ఎకరాలకు చేరిందన్నారు మరింత జాగ్రత్త వహించాల్సిన ఆత్మకూరు చెరువు సాగునీటి సంఘాలు కానీ వ్యవసాయ అధికారులు కానీ ఇరిగేషన్ అధికారులు కానీ రెవెన్యూ అధికారులు కానీ నిర్లక్ష్యం వహించడం వలన ఆత్మకూరు చెరువు దీనస్థితిలోకి వెళ్ళిందని వారు పేర్కొన్నారు. వ్యవసాయానికి మాత్రమే ఉపయోగించే విధంగా ఉన్న చెరువు చేపలకు ప్రాధాన్యత ఇస్తూ సాగునీటిని నిర్లక్ష్యం చేయడం ప్రజాప్రతినిధులు కానీ అధికారులు కానీ నియంత్రించకపోవడం ఈ దుర్భర స్థితికి కారణమైందన్నారు. సువ్వరపాడు, అశ్వినీపురం, పాత జంగాలపల్లె గ్రామాల దగ్గర ఉన్న 4,5,6 నెంబరు తూముల నుంచి సాగునీరు పొలాలకుఅందే పరిస్థితులు లేవన్నారు. అటవీశాఖ వారి ఆధ్వర్యంలో సుమారు 40 సంవత్సరాల క్రితమే నల్ల తుమ్మ చెట్లు పెంపకం జరిగి ఉంది వందల ఎకరాలలో ఈ చెట్లు పెంచబడి ప్రస్తుతం పూర్తిగా ఎండిపోయి ఏ ప్రయోజనం కొరకైతే ఈ స్కీము అమలుపరిచారు అది వృధా అయిపోయిందని, అటవీ శాఖ అధికారులు పరిశీలించి ఈ చెట్ల వలన కలిగే కనీస ప్రయోజనాలను కాపాడుకోవాలని రైతు సంఘం తరపున కోరుతున్నామన్నారు. రెవెన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు ఆత్మకూరు మిగులు జలాల అలుగు కాలువలను వాటికి కేటాయించిన స్థలాలను తూముల నుంచి పొలాలకు అందే సాగునీటి కాలువలను సర్వే జరిపించి పరిరక్షించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరుతున్నామని వారు పేర్కొన్నారు.

### అంగరంగ వైభవంగా

## గోంగూర హోటల్ ప్రారంభం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నెల్లూరు నగరంలోని అన్నమయ్య సర్కిల్, డీమార్ట్‌కు వెళ్లే దారిలో గోంగూర హోటల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ హోటల్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గోంగూర హోటల్ యాజమాన్యం మాట్లాడుతూ ఈ హోటల్ నందు టిఫిన్, భోజనం, వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ ఈ హోటల్ నందు లభిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ హోటల్లో ఫ్యామిలీతో వచ్చి రుచికరమైన భోజనాన్ని చేయవచ్చునని తెలిపారు. నెల్లూరు ప్రజలు గోంగూర హోటల్ ను ఒక్కసారైనా సందర్శించవలసిందిగా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లి, గోంగూర హోటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రారంభమైన

## బి ఫార్మ్ ఫ్రెష్ సూపర్ మార్కెట్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌లో ఘనంగా బి ఫార్మ్ ఫ్రెష్ సూపర్ మార్కెట్ ప్రారంభమైంది. ఈ బి ఫార్మ్ ఫ్రెష్ సూపర్ మార్కెట్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా, తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బి ఫార్మ్ ఫ్రెష్ సూపర్ మార్కెట్ యాజమాన్యం మాట్లాడుతూ.. ఈ సూపర్ మార్కెట్ నందు అన్ని రకాల నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్లు ఈ సూపర్ మార్కెట్ నందు దొరుకుతాయని తెలిపారు. ఇచ్చట హోల్ సేల్ ధరలకే అన్ని వస్తువులు దొరుకుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నెల్లూరు ప్రజలు ఈ సూపర్ మార్కెట్ నందు షాపింగ్ చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్ బాబు, విక్రమ్, సూపర్ మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 16న జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో అన్ని యాజమాన్యాల క్రింద నడుస్తున్న జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం ఈనెల 16వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని డీకే బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఇంటర్మీడియట్ బోర్డు నెల్లూరు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు తెలియజేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు,యూడైస్ ప్లస్, అఫిలియేషన్లు వంటి అంశాల వివరాలతో సమావేశానికి హాజరు కావాలని ఆయన ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఈ సమావేశానికి జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి, యూడైస్ రిసోర్స్ పర్సన్ హాజరవుతారని ఆర్ఐఓ తెలిపారు. అందరు ప్రిన్సిపాళ్లు తగిన సమాచారంతో సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## బీపీసీఎల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా



**బోగోలు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని అల్లిమడుగు గ్రామంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, కృష్ణపట్నం టు హైదరాబాద్ పైప్ లైన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిపిసిఎల్ పైప్‌లైన్ ప్రాజెక్ట్ మేనేజర్ కెప్టెన్ యు.నరసింహారావు, సైట్ ఇంజినీర్ బీమ్లా నాయక్ పాల్గొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనేది పెద్దల మాట. మనం అశ్రద్ధ చేయడం వల్ల గ్రామాలు, నగరాలు, కార్యాలయాలు, వైద్య శాలలు చెత్తా చెదారాలతో నిండిపోతున్నాయని మేనేజర్ కెప్టెన్ యు.నరసింహారావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ భారత దేశాన్ని స్వచ్ఛ భారత్ గా చేయడం కోసం స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం ఈ నెల 1 నుంచి 15 వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బిపిసిఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన పతాక ఆవిష్కరణ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** కందమూరు గ్రామం, నెల్లూరు రూరల్ నందు జనసైనికులు ప్రసాద్, మస్తాన్, ప్రసాద్ ఆధ్వర్యాన జిల్లా నిర్దేశకులు వేముల పాటి అజయ్ పర్యవేక్షణలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఘనంగా జనసేన పతాక ఆవిష్కరించారు. అనంతరం స్థానికుల నడుమ కేక్ కట్ చేసి డిప్యూటీ సిఎంగా అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌గా గెలిచిన ఆనందాన్ని గ్రామస్తులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ నూటికి నూరు శాతం విజయం సాధించిన తరువాత ప్రతికూల పరిస్థితులలో పార్టీ తరుపున నిలబడి స్థానిక ఎన్నికలలో నిలబడిన ఈ గ్రామం లో జెండా ఆవిష్కరణ చేయటం సంతోషంగా ఉందన్నారు. పవన్ కళ్యాణ్ గారిచ్చిన స్ఫూర్తితో ఈ గ్రామస్తులు తమ స్కూలు టీచర్ల విషయంలో, గుంటల రోడ్ల విషయంలో జనసేన పార్టీ తరపున పోరాడారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి గ్రామాల అభివృద్ధికి పాటుపడుతామని, నెల్లూరు రూరల్ హాట్రిక్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహకారంతో గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జనసేన నాయకులు శ్రీపతి రాము, సుధా మాదవ్, సురేష్, మస్తాన్, ప్రసాద్, శేఖర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.